క్లుప్తంగా

ముదిరాజ్ సంఘ భవనానికి నిధులు



ప్రొసిడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సభ్యులు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. రూ.5 లక్షలు మంజూరు చేసి ప్రొసిడింగ్‌ను నిర్మల్‌లో సంఘం సభ్యుడు పోశెట్టికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకులు అడ్వాల రమేశ్, చిన్నయ్య, జీవన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో అభివృద్ధి పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీలో చేపడుతున్న సోమవారం అభివృద్ధి పనులను నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు చొరవతో రూ.5 లక్షలతో డైనింగ్ షెడ్డు, టాయిలెట్స్ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3.70 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.9 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వొడ్నాల రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బిట్లింగ్ నారాయణ, గంగయ్య, వినేష్, రవి, నగేశ్, సురేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ట్రైనింగ్ సెంటర్ మార్చాలి

నిర్మల్‌రూరల్: జిల్లాలో మంగళవారం నుంచి ఐదు రోజులపాటు జరిగే ఉపాధ్యాయుల ట్రైనింగ్ సెంటర్‌ను మార్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ మండలాల ఉపాధ్యాయులకు జిల్లాకేంద్రంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం తగదని పేర్కొన్నారు. వెంటనే ఈ కేంద్రాన్ని ఖానాపూర్‌కు మార్చాలని కోరారు. ఈమేరకు డీఈవో రామారావుకు వినతిపత్రం అందజేశారు. 45 డిగ్రీల ఎండలో దస్తురాబాద్, కడెం, ఖానాపూర్‌కు చెందిన ఉపాధ్యాయులు 50 కి.మీ ప్రయాణించి శిక్షణ కేంద్రాన్ని చేర్చుకోవడం దూరభారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో డీఈవో న్యాయం చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లు రాలేదని ఆందోళన



జీపీ కార్యాలయంలో గుమిగూడిన గ్రామస్తులు

కడెం: మండలంలోని మాసాయిపేట్ పంచాయతీలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను కార్యదర్శి శివన్న ప్రకటించారు. అర్హులైన తమకు ఇళ్లు రాలేదని కొందరు మహిళలు జీపీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఎంపీవో కవిరాజు వివరణ కోరగా.. నిబంధనల మేరకే 18 మంది అర్హుల జాబితా రూపొందించామని, ఇళ్లు దక్కని వారికి రెండో విడతలో అవకాశం ఉంటుందన్నారు.

'మైనార్టీలకు అన్యాయం చేస్తోంది'

భైంసాటౌన్: ఎన్నికల సమయంలో మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్యాయం చేసిందని బీఆర్‌ఎస్ మైనార్టీలు నాయకులు అన్నారు. పట్టణంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ హయాంలో మైనార్టీల అభివృద్ధికి కృషి చేసిందని, ప్రభుత్వంలో అత్యున్నత పదవులు సైతం కట్టబెట్టిందన్నారు. రంజాన్ సందర్భంగా రంజాన్ కిట్లు పంపిణీ చేసిందని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వీటన్నింటిని విస్మరించిందన్నారు. నియోజకవర్గంలో ఇమామ్, మోజంలకు పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించినా స్పందన లేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ యూత్ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ వాసే రసూల్, పట్టణ మాజీ అధ్యక్షుడు అజీజ్ ఖురేషి, నాయకులు ఆసిఫ్ ఖాన్, అతిక్ అహ్మద్, షేక్ అబుజాద్, మహ్మద్ ఇర్ఫాన్ ఉన్నారు.

పౌరసేవలకు అంతరాయం

- కొన్ని పంచాయతీల్లో పనిచేయని ప్రింటర్లు, స్కానర్లు
- ఇబ్బందుల్లో గ్రామీణులు
- మండల కేంద్రాల్లోనే ధ్రువపత్రాల జారీ
- పట్టించుకోని అధికారులు



ధర్మోర పంచాయతీకి సరపరా చేసిన టీఫైబర్ కేబుల్, ఇన్వర్టర్



ధర్మోర గ్రామ పంచాయతీ

లోకేశ్వరం: గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్లు మూలనపడుతున్నాయి. కొన్నిచోట్ల అప్పుడే చెడిపోయాయి. మరికొన్నిచోట్ల బాగున్నప్పటికి నెట్ సౌకర్యం, ప్రింటర్లు, స్కానర్లు లేక పౌరసేవలకు అంతరాయం కలుగుతోంది. వివిధ ధ్రువపత్రాలు కావాలంటే మండలకేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా ఈ–పంచాయతీ కింద ఎంపికైన పల్లెల్లోనూ అదే దుస్థితి ఉంది.

నెట్‌వర్క్ సౌకర్యం

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు క్లస్టర్ పంచాయతీలకు నెట్‌సేవలు కల్పించే పనులను ప్రభుత్వం గతంలో బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థకు అప్పగించారు. వారు కొన్నిచోట్ల కేబుల్ ద్వారా కనెక్షన్లు ఇచ్చి అర్థంతరంగా నిలిపివేయడంతో మరో సంస్థకు బాధ్యతలు అప్పగించింది. వీరు కొన్నింటికి కనెక్షన్లు ఇచ్చారు. మధ్యలో మిషన్ భగీరథ కోసం, సీసీ రోడ్లు, విస్తరణ పనులకు రోడ్లు తవ్వడంతో చాలాచోట్ల కేబుల్ తెగిపోయాయి. ప్రస్తుతం టీఫైబర్ నెట్‌సౌకర్యం కల్పించే పనులు కొనసాగుతున్నట్లు సమాచారం. జిల్లాలో 129 పంచాయతీల్లో టీఫైబర్ కనెక్షన్లు ఇచ్చారు. ఎక్కడా కూడా నెట్ పనిచేయడం లేదు.

ఆన్‌లైన్ సదుపాయం లేకనే..

పంచాయతీల్లో జనన, మరణ ధ్రువపత్రాలు, ట్రేడ్ లైసెన్సుల జారీ, వసూళ్లు చేసిన ఆస్తిపన్నుల రసీదులు, అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధుల వ్యయం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఆన్‌లైన్ సదుపాయం లేక కార్యదర్శులే ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లి అప్‌లోడ్ చేస్తున్నారు.

ప్రింటర్లు పనిచేయడం లేదు



పంచాయతీల్లో జనన, మరణ ధ్రువపత్రాలు ట్రేడ్ లైసెన్సు జారీ కోసం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ధ్రువపత్రాలు పొందుతున్నాం. అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధుల వ్యయం వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు కోసం మండల కార్యాలయానికి వెళ్తున్నాం. టీఫైబర్ కేబుల్, ఇన్వర్టర్లు అందజేశారు. కానీ నెట్ పనిచేయడం లేదు. – నారాయణ, పంచాయతీ కార్యదర్శి, రాయపూర్‌కాండ్లీ

అప్‌లోడ్ చేసుకోవాలి



పౌరసేవల ధ్రువపత్రాలను స్థానికంగా అప్‌లోడ్ చేసుకోవాలి. కొన్నిచోట్ల కంప్యూటర్ నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. మరమ్మతు, ప్రింటర్లకు ఏవైనా నిధులు అవసరమైతే పంచాయతీ తీర్మానం చేసుకుని ఖర్చు చేసుకోవాలి. జిల్లాలో ఇప్పటివరకు కేవలం 129 పంచాయతీల్లో టీఫైబర్ కేబుల్, ఇన్వర్టర్లు అమర్చారు. గ్రామ పంచాయతీల్లో నెట్ సేవలు పనిచేయడం లేదు. – శ్రీనివాస్, డీపీవో

మహనీయుడు గౌతమ బుద్ధుడు

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన మహనీయుడు గౌతమ బుద్ధుడని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుద్ధ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని బుద్ధ విహార్‌లో సోమవారం గౌతమ బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బౌద్ధ ఉపాసకులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వల్లనే మనం బుద్ధుని ధర్మాన్ని, ఆయన సద్గుణాలను తెలుసుకున్నామన్నారు. బుద్ధుని ధర్మాన్ని స్వీకరించడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కమల్ నయన్, అలివేలు మంగ, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, బీజేపీ సీనియర్ నాయకులు సత్యం చంద్ర కాంత్, తాజా మాజీ కౌన్సిలర్ ఏడిపెల్లి నరేందర్, ఆడేపు సుధాకర్, పొన్నం నారాయణ గౌడ్, కొండాజి శ్రావణ్, కందుల రవి, బట్టు లింబాద్రి పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో భారతీయ బౌద్ధమహాసభ ఆధ్వర్యంలో సోమవారం బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుద్ధుడు, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర నాయకుడు సురేకాంత్ పవార్, నాయకులు సాయినాథ్ బద్రె, మానిక్, దీపక్, మహేశ్, అశోక్, సుధాకర్ బాబు, సునీల్, రాహుల్, లక్ష్మణ్, కిషన్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: మన్మద్‌లో బుద్ధ విగ్రహం వద్ద తాజామాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు బాయమొల్ల భోజన్న, భోజారెడ్డి, భూమన్న, రాములు, భూషణ్, శంకర్‌గౌడ్, పృథ్వీ ఉన్నారు.

ముధోల్: బుద్ధుని జయంతి సందర్భంగా తరోడాలో గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జవాన్లకు నివాళి

దిలావర్‌పూర్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్‌తోపాటు పలువురు జవాన్లకు కంజర్ పంచాయతీ ఆవరణలో సోమవారం నివాళులర్పించారు. జవాన్ల చిత్రపటాలకు పూలమాల వేసి వారి త్యాగాలను కొనియాడారు. ఇందులో గ్రామ ప్రత్యేక అధికారి రాజశేఖర్, గ్రామస్తులు, పాల్గొన్నారు.

పూలమాల వేస్తున్న ప్రత్యేకాధికారి రాజశేఖర్ →



దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్కేఎం, ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు నందిరామయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్‌లో సోమవారం సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటం చేస్తామన్నారు. కార్మికుల కనీస వేతనాల అమలు, లేబర్ కోడ్‌ల రద్దు, పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వడం వంటి మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఈ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఏఐఏడబ్ల్యూఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తిరుపతి, నూతన్ కుమార్‌తోపాటు నాయకులు ఎస్ఎన్ రెడ్డి, రాజు, రాజన్న, గంగారం పాల్గొన్నారు.

భైంసాటౌన్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బి విశ్రాంతి భవనం వద్ద కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, కార్మికులకు నష్టం చేసేలా ఉన్న లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం అమలు, తదితర డిమాండ్లతో దేశవ్యాప్త సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. నాయకులు ప్రకాశ్, బాలు, సయ్యాజి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో సమ్మె కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు నాణ్యమైన విద్యనందిస్తున్నారని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో సోమవారం కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంతోపాటు ముథోల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ప్రైవేట్‌కు ధీటు ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. త్వరలోనే కళాశాలలో పీజీ కోర్సులు ప్రారంభించేలా కృషి చేస్తానన్నారు. ఇప్పటికే పీఎం ఉష కింద రూ.5కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ కరోల్ల బుచ్చయ్య, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డా నగేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ప్రభుత్వ కళాశాలలో చేరండి

కుంటాల: ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరుతూ కుంటాల జూనియర్ కళాశాల అధ్యాపకులు సోమవారం మండలంలోని అంబుగామలో ప్రచారం నిర్వహించారు. కళాశాలలో ప్రభుత్వం కల్పించే వసతులను విద్యార్థులకు, పోషకులకు వివరించారు. అధ్యాపకులు బండారి గజేందర్, జాదవ్ ఉమేశ్, రాథోడ్ సురేష్, సంగీత పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయంలో పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

బాసర: పౌర్ణమి సందర్భంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి క్షేత్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం చండీహోమం, శ్రీకృష్ణ పారాయణం పూజలు నిర్వహించారు. అర్చకుడు భూమన్న యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. స్వామివారికి భక్తులు పూజలు చేశారు.

పరామర్శ

లోకేశ్వరం: జోహర్‌పూర్ గ్రామానికి చెందిన మ్యాదరి సాయన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ సోమవారం పరామర్శించారు. దిగంబర్, ప్రశాంత్, శేఖర్, పోతన్న తదితరులు ఉన్నారు.

35 దరఖాస్తుల స్వీకరణ

కుంటాల: భూభారతి కార్యక్రమంలో భాగంగా కుంటాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసిందని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోని వారి కోసం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ లో సోమవారం 35 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. డీటీ నరేశ్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

స్క్రాప్ షాపులో అగ్నిప్రమాదం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఓ స్క్రాప్ షాపులో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదవశాత్తు మంటలు రావడంతో స్థానికులతో పాటు ఫైరింజన్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పేశారు. పక్కనే నివాసాలు ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని యజమాని గుగ్గిళ్ల శంకర్ తెలిపారు.



మంటలు ఆర్పివేస్తున్న స్థానికులు

అమ్మవారి సన్నిధిలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే

బాసర: బాసర అమ్మవారి సన్నిధిలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గణేశ్‌కు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మమ్మాయి రమేశ్, పార్టీ మాజీ జనరల్ సెక్రటరీ సంజీవరావు దేశ్‌ముఖ్, టౌన్ అధ్యక్షుడు రాజేశ్వర్ దేశ్‌ముఖ్ తదితరులు స్వాగతం పలికారు. పూజల అనంతరం శాలువాతో సత్కరించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణేశ్

కల్యాణం..కమనీయం

కుంటాల: మండలంలోని అందాకూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీ గోవిందమ్మ, వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుడు మోనాజీ శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. డప్పు,వాయిద్యాలతో గోవిందమ్మ, వీర బ్రహ్మేంద్రస్వామి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనతంరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. విశ్వకర్మ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

హద్దురాళ్ల ఏర్పాటుపై వివాదం



హద్దురాళ్ల ఏర్పాటు నిలిపివేస్తున్న పోలీస్ సిబ్బంది, గుమిగూడిన జనం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్ శివారులోని గ్రామకంఠం భూమిలో సోమవారం సుర్జాపూర్ గ్రామస్తులు హద్దురాళ్ల ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. విషయం తెలుసుకున్న ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని నిలిపివేశారు. భూ విషయమై ఇరు గ్రామాల మధ్య ఉన్న సమన్వయ లోపంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సమగ్రంగా చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఏకపక్షంగా హద్దురాళ్లు ఏర్పాటుచేసి వివాదాలకు కారణం కావద్దని గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిపోయారు. ఈ విషయమై మస్కాపూర్ గ్రామస్తులు సైతం హద్దురాళ్ల ఏర్పాటుపై చర్చించుకోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

సంక్షిప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఖానాపూర్: సుర్జాపూర్, బాదనకుర్తి, మేడంపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు సోమవా రం ప్రారంభమయ్యాయి. ఏఎంసీ చైర్మన్ భూమ న్న, వైస్‌చైర్మన్ మాజిద్, నాయకులు దయానంద్, చిన్నం స త్యం, వెంకాగౌడ్, రమేశ్, రాజునాయక్, శంకర్, యూసుఫ్‌ఖాన్, షౌకత్ పాషా, తోట సత్యం, గంగన్న, ఐకేపీ ఏపీఎం భోజన్న, సీసీ భిక్‌సింగ్ ఉన్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచండి

కుంటాల: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. మండలంలోని లింబా(కె) గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. వీవోఏ గౌతమ్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ అంత్యక్రియల్లో మాజీమంత్రి

సారంగాపూర్: మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన తాజామాజీ సర్పంచ్ గోనె లక్ష్మణ్ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన విషయం విధితమే. సోమవారం ఆయన అంత్యక్రియల్లో మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానన్నారు. నాయకులు, తాజా మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

ముధోల్: మండల కేంద్రానికి చెందిన ఎండీ హాజర్ ఇటీవల కరెంట్ షాక్ తగిలి మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను మోహన్‌రావు ప్రజాట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావుపటేల్ సోమవారం పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. మాజీ ఎంపీపీ జాదవ్ సుభాష్ పటేల్, ఏజాజ్, నాయకులు తదితరులు ఉన్నారు.

దరఖాస్తులు అందజేయాలి

కుంటాల: మండలంలోని గ్రామాల్లో రాజీవ్ యువ వికాసం పథకానికి 1240 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా 199 దరఖాస్తు చేసుకున్నవారు ఆన్‌లైన్ ప్రతులను అందజేయలేదని పేర్కొన్నారు. వీటితోపాటు దరఖాస్తు చేసుకున్నవారు పాన్‌కార్డు కూడా అందజేసి సహకరించాలని కోరారు.

రైతు నమోదు సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలని సంకల్పంతో చేపట్టిన రైతు నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) చేసుకోవాలని ఏవో జగదీశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం రైతు నమోదు కార్యక్రమాన్ని ఏఈవోలతో కలిసి చేపట్టారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూయాజమాన్య వివరాలను రైతు ఆధార్‌సంఖ్యకు అనుసంధానంతో పాటు సదరు రైతుకు ఫార్మర్ ఐడీ కేటాయిస్తామన్నారు.

లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మెనేజ్‌మెంట్ నుంచి లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 17లోగా మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌లో గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండి, 60 శాతం మార్కులు, ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్ (సివిల్), డిప్లొమా (సివిల్) బీటెక్ (సివిల్), లేక ఏ ఇతర సమానమైన అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఓసీ, బీసీ అభ్యర్థులు 35 ఏళ్లు, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు 40 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులకు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2500 శిక్షణ ఫీజు ఉంటుందని తెలిపారు. ఎంపికైనవారికి జిల్లా కేంద్రంలో ఈనెల 26 నుంచి జులై 26వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.వివరాలకు 98490 81489, 70326 34404, 94419 47339 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ట్యాంక్ నీరు వృథాకాకుండా చర్యలు

సాక్షి స్పందన



ట్యాంకుపై పైపు సరిచేస్తున్న సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలోని తాగునీరు సరఫరా చేసే ట్యాంకు నిండినా పంచాయతీ సిబ్బంది మోటార్ ఆఫ్ చేయడం లేదు. నీరు రోడ్డుపై పారుతున్నాయి. దీనిపై 'తాగునీటిని వృథా చేస్తున్నరు' శీర్షికన సాక్షిలో ఈనెల 9న కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు సోమవారం సాయంత్రం ట్యాంక్ నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.